బ్యూటీఫుల్.. బస్‌బే

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎక్కడా రాజీ పడటంలేదు. విద్య, వైద్యం వంటి వాటితో పాటు అన్నింటా తన మార్కు చూపుతూ ప్రజలు కోరింది చేస్తూ వారి మన్ననలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల నిర్మించిన నూతన బస్ బేలు ప్రయాణికుల మనస్సులను ఎంతగానో చూరగొన్నాయి. కూర్మన్నపాలెంలో నిర్మించిన నూతన బస్‌బే ఇందుకు చక్కటి ఉదాహరణ అని చెప్పొచ్చు.

- ఆధునిక హంగులు.. చక్కటి సౌకర్యాల కల్పన
- అద్భుతంగా రూపొందిన కూర్మన్నపాలెం బస్ షెల్టర్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



కూర్మన్నపాలెంలో నూతనంగా నిర్మించిన బస్‌బే

కూర్మన్నపాలెం: విశాఖ ప్రగతిపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నగర సుందరీకరణకు పెద్దపీట వేస్తున్నారు. స్మార్ట్ సిటీగా పేరొందిన విశాఖలో అత్యాధునిక హంగులతో స్మార్ట్ బస్‌బేలు నిర్మించారు. ముఖ్యంగా కూర్మన్నపాలెంలో సుమారు రూ. 35 లక్షల వ్యయంతో ప్రయాణికుల కోసం విశాలమైన, సౌకర్యవంతమైన బస్ బేలు నిర్మించారు. కూర్చునేందుకు పొడవైన గ్రానైట్ పలకలతో బెంచీలు, నడిచేందుకు ట్రాక్ ఏర్పాటు చేశారు. రాత్రి వేళ విద్యుద్దీపాల వెలుగుల్లో బస్ బేలు మెరిసిపోతున్నాయి. అగనంపూడి మీదుగా గాజువాకకు రాకపోకలు సాగించే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని నూతన బస్ షెల్టర్లలో అనేక సౌకర్యాలు కల్పించారు. కూర్మన్నపాలెం నుండి ఒక వైపు గాజువాక, మరో వైపు ఉక్కునగరం, అగనంపూడి పరిసర ప్రాంతాలకు ఇదే ప్రధాన సెంటర్ కావడంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కూర్మన్నపాలెం కూడలిలో ఉన్న పాఠశాలలు, కాలేజీలు, స్టీల్‌ప్లాంట్, ఫార్మా కంపెనీలకు వచ్చిపోయే వారితో ఉదయం, సాయంత్రం వేళ్లలో రద్దీగా ఉంటుంది. సిటీ బస్సులు, దూరప్రాంత ఆర్టీసీ సర్వీసుల కోసం వేచి ఉండే వారు ఇబ్బందులు పడకుండా నూతన బస్ షెల్టర్లు నిర్మించారు.

నాడు ఇబ్బందులతో సతమతం..

కూర్మన్నపాలెం ప్రధాన సెంటర్‌లో గతంలో వేచి ఉండేందుకు సరైన సౌకర్యాలు లేక ప్రయాణికులు సతమతమయ్యేవారు. గత ప్రభుత్వ హయాంలో బస్ షెల్టర్ల సమస్యపై పట్టించుకున్న నాథుడు లేడు. ఆర్టీసీ బస్సుల కోసం ఎండ, వానల్లో వేచి చూడాల్సిన పరిస్థితులు ఉండేవి. కానీ ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రధాన సెంటర్లలో బస్ షెల్టర్ల నిర్మాణం చేపట్టారు.

నేడు మెరుగైన సౌకర్యాలు....

కూర్మన్నపాలెం సెంటర్‌లో గాజువాక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని షెల్టర్‌లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. వర్షం వచ్చినా, ఎండ కాసినా ఇబ్బంది లేకుండా షెడ్డు నిర్మాణం చేపట్టారు. రూ. 35 లక్షల వ్యయంతో అత్యంత సుందరంగా దీన్ని నిర్మించారు.

పరిశుభ్రత పాటిస్తున్నారు..



బస్ షెల్టర్లలో వేచి ఉండే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పరిశుభ్రత కూడా పాటిస్తున్నారు. గతంలో రోడ్లపైనే నిలబడేవాళ్లం. ఈ బాధలు పడలేక ప్రైవేట్ వాహనాల్లో వెళ్లే వాళ్లం. ప్రస్తుతం ఆధునిక సౌకర్యాలతో బస్ షెల్టర్లు నిర్మించడంతో ఎంత సేపైనా బస్సు కోసం వేచి ఉంటున్నాం.

–జశ్వంత్, ప్రయాణికుడు

ప్రయాణికులు పెరిగారు..



దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఆర్టీసీ సర్వీసులనే నమ్ముకుంటారు. అటువంటి వారి కోసం ప్రభుత్వం నూతన బస్ షెల్టర్లు నిర్మించడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. గతంలో సరైన సౌకర్యాలు ఉండేవి కావు. ప్రభుత్వం బస్ షెల్టర్లపై దృష్టి సారించడంతో సౌకర్యవంతంగా ఉంది.

– చిట్టి బాలకృష్ణ, కూర్మన్నపాలెం

సౌకర్యవంతంగా ఉన్నాయి..



మెరుగైన సౌకర్యాలతో నిర్మించిన కొత్త బస్ షెల్టర్లు బాగున్నాయి. ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా బెంచీలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం వల్ల సౌకర్యవంతంగా ఉంది. తాగునీరు కూడా ఏర్పాటు చేస్తే ఇంకా బాగుంటుంది.

– బలిరెడ్డి శ్రీకాంత్, వడ్లపూడి



క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి లక్ష పుష్పార్చన



అయ్యప్పకు లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న ఎం.ఆర్.వైద్యనాథన్

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని స్వామి అయ్యప్ప దేవాలయంలో అయ్యప్పకు శనివారం లక్ష పుష్పార్చన నిర్వహించారు. మండల కాలం సందర్భంగా అయ్యప్పకు డిసెంబర్‌లో పుష్పార్చన నిర్వహించడం జరుగుతుందని శ్రీ స్వామి అయ్యప్ప అలయ కమిటీ అధ్యక్షుడు బి.ఎ.నాయుడు తెలిపారు. ఆలయ అర్చకులు ఎం.ఆర్.వైద్యనాథన్, కృష్ణన్ నంబూద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో అలయ కమిటీ కార్యదర్శి శేషగిరిరావు, సంయుక్త కార్యదర్శి వీరారావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని చోట పార్కింగ్ నిషేధం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ నుంచి మారుతీ సర్కిల్ వరకు, మారుతీ సర్కిల్ నుంచి షీలానగర్ వైపు మార్గాల్లో రోడ్డుపై ఎటువంటి భారీ వాహనాలు పార్కింగ్ చేయకూడదని గాజువాక ట్రాఫిక్ ఎస్‌ఐ సయ్యద్ యూసఫ్ తెలిపారు. తరచూ ఈ మార్గాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ రోడ్డుపై గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించి పార్కింగ్ చేసే భారీ, అతిభారీ వాహనాలపై జరిమానా విధిస్తామని తెలిపారు.

'జగనన్న గోరుముద్ద' పరిశీలన



విద్యార్థుల ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

అక్కిరెడ్డిపాలెం: జగనన్న గోరు ముద్దతో విద్యార్థులకు కావాల్సిన పోషకాలు అందుతున్నాయని ఎంఈవోలు ఎం.సునీత, విశ్వనాథం అన్నారు. శనివారం 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్లో జగనన్న గోరుముద్ద ఆహారాన్ని పరిశీలించారు. బిర్యానీ, సాంబారు, పరమాన్నం నాణ్యతను పరీక్షించారు. పాఠశాల హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.అంజనేయ నుంచి ఆహారం తీసుకుంటున్న విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి ఆహారం తీసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.

జిందాల్‌తో జరిగిన ఎంవోయూ రద్దు చేయాలి



స్టీల్‌ప్లాంట్ సీజీఎం సోబ్తీకి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

ఉక్కునగరం: జిందాల్‌తో జరిగిన ఎంఓయూను రద్దు చేయాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏఐయూసీ, ఐఎన్‌టీయూసీ, సిటు ఆధ్వర్యంలో ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. ఎంఓయూను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నూరు శాతం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికవర్గం గత 1050 రోజుల నుంచి దీక్షలు చేస్తుందన్నారు. కాని ఉక్కు యాజమాన్యం ఈవోఐ పేరిట జిందాల్‌లో రూ. 500 కోట్లకు రెండేళ్ల ఒప్పందం చేసుకోవడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆ ఒప్పందాన్ని రద్దు చేసి సెయిల్‌తో ఎంవోయూ చేసుకోవాలని లేదా సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్టీల్‌ప్లాంట్ సీజీఎం సోబ్తీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, నీరుకొండ రామచంద్రరావు, జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, జె. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సకల పాపహరణం.. ఉత్తర ద్వార దర్శనం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాలకు పోటెత్తిన భక్తులు



భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రసన్న వేంకటేశ్వరాలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు



విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరుడు



షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో భక్తులు



శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామిని వెన్నతో అలంకరించిన దృశ్యం



స్టీల్‌ప్లాంట్ ఆలయంలో ఉత్తర ముఖ దర్శనంలో వేంకటేశ్వరస్వామి



అగనంపూడిలో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న కార్పొరేటర్ వరలక్ష్మీ ప్రసాద్



వాంబే కాలనీలో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ పాత్రుడు

అక్కిరెడ్డిపాలెం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని ఉత్తర ద్వార దర్శనం ద్వారా ప్రసన్న వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గంగ్రెడ్డి రామునాయుడు, బొడ్డేటి అచ్చిలి నాయుడు, ఎం.సత్యవతి, పెట్ల అప్పారావు, శాంతి కుమారి, మిండా లక్ష్మి, ఎన్.శ్రీనివాసరావు, ఎక్స్ అఫిషియో మెంబర్ నారాయణాచార్యులు, ఆలయ ఈవో జగన్నాథరావు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. ట్రస్ట్ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. మిందిలోని శ్రీ వినాయక వేంకటేశ్వర సాయినాథ నిలయంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని వేంకటేశ్వరుని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త గుడివాడ నాగమణి గుర్నాథరావు ఆధ్వర్యంలో చింతపల్లి ఈశ్వరరావు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

వైభవంగా వెంకన్న ఉత్తర ముఖ దర్శనం..

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 3 గంటల నుంచి వేంకటేశ్వర స్వామిని భక్తులు ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకున్నారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి నేతృత్వంలో అర్చకులు హరి నారాయణ, కృష్ణమాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు, దీపాలతో అర్చనలు చేశారు.

79వ వార్డులో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతి నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారు జాము 3 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శన కల్పించారు. వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మి రామునాయుడు పాల్గొని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఈ.కె. చారి, కమిటీ ప్రతినిధులు సాయిబు నాయుడు, నరసింహారావు, కృష్ణా రావు, గురునాథ్, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు తదితరులు భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వుడా కాలనీలో..

పెదగంట్యాడ: వుడా కాలనీలో వేంచేసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు. నడుపూరు వాసవీ జ్ఞానమందిరంలో ఆలయ అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు, కార్యదర్శి కులుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబే కాలనీలోని వేంకటేశ్వర స్వామి వారికి పూజలు, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల, మద్దాల అప్పారావు పాల్గొన్నారు.

నెల్లిముక్కు రామాలయంలో..

జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కు కోదండ రాముని ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు చేశారు. వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీభాయి, పులి వెంకట రమణారెడ్డి, దూడ సింహాచలంరెడ్డి, ధర్మాల పైడిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం కాలనీలో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు లక్ష్మీపురంకాలనీలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారిని వెన్నతో ప్రత్యేకంగా అలంకరించి, తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మోదేకుర్తి సేవలకు ప్రశంసలు..

ఉక్కునగరం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సింహాచలంలో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వార దర్శనంలో స్టీల్ ప్లాంట్ ఎం.ఎం.ఎస్.ఎం విభాగం జనరల్ ఫోర్‌మెన్ మోదేకుర్తి సత్యనారాయణ తన వంతు సేవలందించారు. శనివారం కూడా తెల్లవారి మూడు గంటల నుంచి సాయంత్రం వరకు నిరాటంకంగా మైక్ ద్వారా భక్తులకు సేవలు అందించారు. నగర ఏడీసీపీ–2 కె. ఆనందరెడ్డి, ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి మోదేకుర్తి సేవలను కొనియాడారు.



అగనంపూడిలో విద్యుద్దీపాల అలంకరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం



మైక్ ద్వారా సేవలందిస్తున్న మోదేకుర్తి



నడుపూరు వాసవీ జ్ఞానమందిరంలో మహిళల పూజలు

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



అందజేసిన ట్యాబ్‌లతో విద్యార్థులు, నాయకులు, ఎంఈఓలు

అక్కిరెడ్డిపాలెం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగన్ ఒక వరం అని 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అన్నారు. శనివారం మింది జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్‌తో కూడిన ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. కోట్ల వ్యయంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారు చేశారన్నారు. రూ.33 వేల ఖరీదు గల బైజూస్‌తో కూడిన ట్యాబ్‌లు అందజేయడం అభినందనీయమన్నారు. ఎంఈవో – 1 విశ్వనాథం, ఎంఈవో –2 ఎం.సునీత మాట్లాడుతూ విద్యార్థులు ఎవరైనా ట్యాబ్‌లను ఇతర సమాచారం కోసం వినియోగిస్తే విద్యార్థుల చైల్డ్ ఐడీ ద్వారా తెలిసిపోతుందన్నారు. అలాంటి వారి నుంచి ట్యాబ్‌లు స్వాధీనం చేసుకుంటామన్నారు. పాఠశాల హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.అంజనేయ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వరదాడ వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట



తూనికలు, కొలతల్లో మోసాలను వివరిస్తున్న అధికారులు

గాజువాక: మార్కెట్లలో జరిగే మోసాలను అరికట్టేందుకు వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని గాజువాక–1 లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.ఎం.రాధాకృష్ణ అన్నారు. ఆసరా ఆధ్వర్యంలో చేపట్టిన వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా గాజువాక మహిళా రైతు బజార్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులు తాము మోసపోయినట్టు గుర్తిస్తే లీగల్ మెట్రాలజీ అధికారులను సంప్రదించవచ్చన్నారు. అయితే తాము కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తప్పకుండా ఉండాలని, బిల్లు ఉంటేనే న్యాయం చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. ఆసరా విశాఖ జిల్లా ఇన్‌చార్జి తోట శత్రుఘ్నుడు మాట్లాడుతూ వినియోగదారులను చైతన్యపరచడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఉమాసుందరి, రైతు బజార్ ఈవో హరిత తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం'



ఉక్కు దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారపోస్తున్న బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం 1045వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వ రంగ సంస్థలను అభివృద్ధి చేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలు దండుకుని ప్రజలను అణచివేస్తారని విమర్శించారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి చక్కటి స్పందన



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

గాజువాక: గాజువాక బీజేపీ నాయకులు 70వ వార్డు టీపీఎన్ కాలనీలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. అనంతరం వైద్య సిబ్బంది బీపీ, సుగర్, క్యాన్సర్ పరీక్ష, ఈసీజీ, ఈఎన్‌టీ తదితర వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 230 మందికి వైద్య సేవలు అందించినట్టు నర్సింగరావు తెలిపారు. గాజువాకలోని 20 వార్డుల్లోను ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. స్ఫూర్తి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, పావని, కట్టా పద్మ, రోహిణి, నాగేశ్వరరావు, కేర్ ఆస్పత్రి వైద్యులు వేణి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు




క్రిస్మస్ సందర్భంగా వివిధ వేషధారణల్లో పాఠశాల చిన్నారులు

అగనంపూడి: అగనంపూడి ఎఫ్ఎస్‌సీ చర్చిలో ఘనంగా క్రిస్మస్ ఉత్సవాలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంబరాలు ప్రారంభించారు. బాలలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకురాలు తులసి, పి.ఎలీషా జాన్ డేవిడ్, ఎం.భరత్ కుమార్, బలిరెడ్డి సత్యనారాయణ, న్యాయవాదులు గోడి రామకృష్ణ, అండిబోయిన లక్ష్మి, అప్పలరాజు పాల్గొన్నారు.

- 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ సమీపంలోని ఏబీఎస్ పాఠశాలలో క్రిస్మస్ ఉత్సవాలు బాలల మధ్య ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా బాలలు మేరీమాత, క్రిస్మస్ తాత అలంకరణలో అలరించారు. ఏబీఎస్ వ్యవస్థాపకులు పీఎం కొండయ్య క్రీస్తు బోధనలు, జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ దీపక్, ప్రిన్సిపాల్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు..

ఉక్కునగరం: స్థానిక అరబిందో ఐడియల్ స్కూల్‌లో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు శాంతా క్లాజ్, వివిధ వేషదారణలతో ఉత్సాహంగా గడిపారు. ఏసుక్రీస్తు గీతాలు ఆలపించారు. నృత్య ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వి. రామారావు ముఖ్య అతిథిగా హాజరై జీసస్ గొప్పతనం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్త టి. ఎల్లేశ్వరరావు, ప్రధానాచార్యులు షాజిమోన్ జోసఫ్, ప్రధానోపాధ్యాయులు ఎస్. రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొని క్రీస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.



ఏబీఎస్ పాఠశాలలో మేరీమాత, క్రిస్‌మస్ తాతలుగా బాలలు

జాతీయ నృత్య పోటీలకు నడుపూరు విద్యార్థులు



నృత్య పోటీల్లో విద్యార్థినుల బృందం

పెదగంట్యాడ: జాతీయ స్థాయి జానపద నృత్య పోటీలకు నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. విజయవాడ దగ్గర హిల్స్ పారడైజ్‌లో విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ప్రథమ స్థానంలో నిలిచారు. టి.నవ్యశ్రీ, టి.తేజస్వీ, ప్రణీత, డాని శ్రీవల్లి, ఎ.తేజశ్రీ, ప్రియాంక సామల్ బృందం ఈ పోటీల్లో సత్తా చాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్టు ప్రాధాన్యం–చెట్టుతో మనిషికి ఉన్న అనుబంధాన్ని వివరించేలా నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వచ్చే నెల 3 నుంచి 6 వరకూ ఒడిశాలోని భువనేశ్వర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు వీరు హాజరు కానున్నారు. సత్తా చాటి వచ్చిన విద్యార్థులను శనివారం జరిగిన అభినందన సభలో డీఈవో చంద్రకళ, ఉప విద్యాశాఖాధికారి గౌరీశంకర్, పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, వీరికి శిక్షణ ఇచ్చిన రాంబాబు, సుగుణ, శోభారాణి, టీవీ లక్ష్మిలను అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్‌నగర్ రాసాలమ్మకాలనీకి చెందిన కుచ్చెర్లపాటి సతీష్‌కుమార్(31) తన భార్య భాగ్యలక్ష్మితో కలిసి ఉంటున్నాడు. మృతుడు సతీష్‌కుమార్‌కు ఒక బాబు, పాప ఉన్నారు. ప్రైవేట్‌గా ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న సతీష్‌కుమార్ తరచూ బెట్టింగులు ఆడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేవాడు. భార్య భాగ్యలక్ష్మితో 20 రోజుల క్రితమే తాను చచ్చిపోతానని, పిల్లలను బాగా చూసుకోవాలని చెప్పాడు. శనివారం ఉదయం భార్య భాగ్యలక్ష్మిని టిఫిన్ తీసుకు రమ్మని చెప్పి పంపించాడు. తాను ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న దువ్వాడ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.